క్లుప్తంగా

పంచాయతీ కార్యదర్శిపై దాడి చేసిన వారిని శిక్షించాలి

భువనగిరిటౌన్ : పంచాయితీ కార్యదర్శి చెన్నూరి రాజశేఖర్‌పై దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు గణగాని శశికాంత్‌గౌడ్ డిమాండ్ చేశారు. పంచాయతీ కార్యదర్శిపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ పలువురు పంచాయతీ కార్యదర్శులు శుక్రవారం అదనపు కలెక్టర్ గంగాధర్ వినతి పత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు సిద్ధేశ్వర్, రాజు తదితరులు ఉన్నారు.

చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చౌటుప్పల్ రూరల్: చౌటుప్పల్ మండలం అంకిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన ముద్దం సత్తయ్యకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును శుక్రవారం కాంగ్రెస్ మండల నాయకుడు బొమ్మని సాయి అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ముద్దం సుమిత్ర సత్తయ్య, నల్ల నర్సింహ, యాట శంకరయ్య, పర్నె నర్సిరెడ్డి, వెంకటేష్, చేతన్ పాల్గొన్నారు.

ఖిలాపై విద్యార్థుల సందడి



ఖిలాపై సందడి చేస్తున్న విద్యార్థులు

భువనగిరి: భువనగిరి ఖిలాను శుక్రవారం వికారాబాద్ జిల్లా పెద్దమూర్‌లోని వాగ్దేవి, శ్రీవాణి ప్రైమరీ పాఠశాలకు చెందిన విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా చారిత్రాత్మక కట్టడాలు తిలకించారు. గైడ్ ఆవుల వినోద్ విద్యార్థులకు ఖిలా ప్రాముఖ్యత, చరిత్రను వివరించారు.

మృతుల కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

గుండాల : మండలంలోని సీతారాంపురం గ్రామానికి చెందిన వనబోజు సందీప్, సుద్దాల గ్రామానికి చెందిన దంతూరి బాలనర్సయ్య ఇటీవల మృతి చెందారు. మృతుల కుటుంబాలను శుక్రవారం మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్ పరామర్శించారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ మందడి రామకృష్ణారెడ్డి, గడ్డమీది పాండరి, పి.మల్లేష్, మీరాల కుమార్, అయిలయ్య, వేణుగోపాల్‌రెడ్డి, కాశయ్య, మహోదయ్, మల్లయ్య, శ్రీధర్ పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

చౌటుప్పల్ : మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం గ్రామంలో తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగతనం జరిగింది. ఈ ఘటన శుక్రవారం వెలుగుచూసింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పిల్ల పరమేష్ మున్సిపల్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. చిట్యాల మండలం వెలిమినేడు గ్రామంలోని బంధువుల ఇంట్లో శుభకార్యం ఉండగా గురువారం కుటుంబ సభ్యులంతా వెళ్లారు. కుటుంబ సభ్యులు అక్కడే ఉండగా పరమేష్ మాత్రం శుక్రవారం సాయంత్రం ఇంటికి వచ్చాడు. అప్పటికే ఇంటి బయట గేటు, లోపల డోర్ తెరిచి ఉంది. ఆందోళనకు గురైన పరమేష్ వెంటనే లోపలికి వెళ్లి చూశాడు. లోపల ఉన్న సెల్ఫ్‌లు, బీరువాలో సామగ్రి చిందరవందరగా పడి ఉండడంతో అనుమానం వచ్చి అందులో దాచి ఉన్న బంగారు నగలు, నగదును వెతకగా కనిపించలేదు. లోపల దాచిన ముప్పావు తులం విలువైన రెండు ఆభరణాలు, రూ.20 వేల నగదును గుర్తుతెలియని వ్యక్తులు దోచుకెళ్లారు. పరమేష్ వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. ఘటనా స్థలాన్ని పోలీసులు సందర్శించి వివరాలు సేకరించి ఆధారాల కోసం పరిశీలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తండ్రి మందలించాడని ఆత్మహత్య

ఆలేరురూరల్ : తండ్రి మందలించాడని ఉరి వేసుకుని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆలేరులో చోటుచేసుకుంది. శుక్రవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆలేరు పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన పర్వతం సాయికుమార్(20) ట్రాలీ ఆటోలో పాత ఇనుప సామాను వ్యాపారం చేస్తూ తల్లిదండ్రులతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం తండ్రి మందలించడంతో మనస్తాపానికి గురైన యువకుడు ఇంట్లో నుంచి బయటకు వచ్చి సాయంత్రం ఆలేరులోని ఓ వెంచర్‌లో తాడుతో చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. తండ్రి అంజయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రజినీకర్ తెలిపారు.

స్వాతంత్య్ర సమరయోధుడు ఎడ్ల నారాయణ రెడ్డి మృతి



నారాయణరెడ్డి(ఫైల్)

రాజాపేట : మండలంలోని కుర్రారం గ్రామానికి చెందిన స్వాతంత్య్ర సమరయోధుడు ఎడ్ల నారాయణరెడ్డి (94) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన మృతదేహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఇంకా.. మట్టి రోడ్డే దిక్కు

- బీటీకి నోచుకోని దాతర్‌పల్లి – మల్లాపురం రోడ్డు
- వర్షాకాలంలో చిత్తడిగా మారుతున్న వైనం
- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న గ్రామాల ప్రజలు



దాతర్‌పల్లి – మల్లాపురం గ్రామాల మధ్య అధ్వానంగా ఉన్న మట్టి రోడ్డు

యాదగిరిగుట్ట రూరల్: మండలంలోని దాతర్‌పల్లి–మల్లాపురం గ్రామాల మధ్య రాకపోకలు సాగించేందుకు ఇంకా మట్టి రోడ్డే దిక్కైంది. ప్రభుత్వాలు, పాలకులు మారిన ఈ రోడ్డు బీటీకి నోచుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. ఈ రోడ్డు గుంతలమయంగా మారి అధ్వానంగా తయారవడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక రాత్రి సమయాల్లో గుంతలు కన్పించక వాహనదారులు కింద పడిన సంఘటనలు అనేకం ఉన్నాయి. వర్షాకాలంలో చినుకు పడితే చాలు ఈ రోడ్డంతా బురదమయం మారి కనీసం నడవడానికి కూడా వీలు కాదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తగ్గనున్న దూరం..

మల్లాపురం–దాతర్‌పల్లి గ్రామాల మధ్య మూడు కిలోమీటర్ల దూరం మట్టి రోడ్డు ఉంటుంది. ఈ రోడ్డును బీటీగా మార్చితే మల్లాపురం గ్రామం నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లడానికి ప్రయాణికులకు దూరం తగ్గనుంది. ప్రస్తుతం ఈ రెండు గ్రామాల మధ్య బీటీ రోడ్డు లేకపోవడంతో ఆదనంగా ఆరు కిలోమీటర్లు ప్రయాణించి యాదగిరిగుట్ట మీదుగా వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారు. దాతర్‌పల్లి గ్రామం నుంచి తుర్కపల్లి మండలానికి వెళ్లడానికి దూరం తగ్గి వాహనదారులకు ఇబ్బందులు తొలగుతాయి. ఇప్పటికైనా ఆధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ రోడ్డును బీటీ రోడ్డుగా మార్చాలని పలువురు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



మా గ్రామం నుంచి వాహనాల మీద దాతర్‌పల్లి గ్రామానికి వెళ్లాలంటే మట్టి రోడ్డు దిక్కైంది. మంటి రోడ్డంతా గుంతలు మారింది. వర్షాకాలంలో బురదమయంగా మారుతుంది. దీంతో ఈ మర్గంలో ప్రయాణం చదానికి ఇబ్బందులు పడుతున్నాం. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఈ రోడ్డును బీటీగా మార్చాలని కోరుతున్నాం.

– మోటె శేఖర్, మల్లాపురం

బీటీరోడ్డుగా మార్చాలి



దాతర్‌పల్లి గ్రామం నుంచి మల్లాపురం గ్రామం వరకు ఉన్న మట్టి రోడ్డును బీటీ రోడ్డుగా మార్చాలని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య దృష్టికి తీసుకెళ్లాం. రోడ్డుకు సంబంధించి ఎస్టిమేట్ పనులను పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. బీటీ రోడ్డు నిధులు మంజూరు చేయాలని రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతున్నాం.

– కాల్నె భాస్కర్, మాజీ సర్పంచ్, దాతర్‌పల్లి

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం



సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

మోత్కూరు : నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. మున్సిపల్ కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంట్లో సీసీ కెమెరాలు పెట్టించుకోవాలిన అవసరం ఉందన్నారు. నిందితులను గుర్తించడంలో సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నాగరాజు, ఆలయ నిర్వాహకులు కాంబోజు రాజశేఖర్, వారాల సోంబాబు పలువురు నాయకులు మహేందర్, గడ్డం నర్సింహ, ఆలయ పూజారులు తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అండర్ పాస్ నిర్మాణ కమిటీ సభ్యులు

భువనగిరి : ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద అండర్ పాస్ నిర్మించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దయ్యాల నర్సింహ అన్నారు. శుక్రవారం మండలంలోని పెంచికల్‌పహాడ్, రామకృష్ణాపురం గ్రామాల్లో ధర్నాకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అండర్ పాస్ నిర్మాణం చేపట్టకపోవడంతో నాలుగు మండలాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పల్లెర్ల అంజయ్య, అండర్‌పాస్ నిర్మాణ కమిటీ కన్వీనర్ సిల్వేరు ఎల్లయ్య, కో కన్వీనర్లు సిద్దారెడ్డి, మల్లయ్య, నాయకులు పాండు, బిక్షపతి, రాములు, శేఖర్‌రెడ్డి, పారిజాత, వెంకటరెడ్డి, లలిత, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలి



నిరసన దీక్షలో పాల్గొన్న నాయకులు

రాజాపేట: మండలానికి సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని కోరుతూ బీజేపీ, బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని గాంధీ సెంటర్‌లో నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ సాగునీరు లేక మండలంలో రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి కాళేశ్వరం జలాలతో మండలంలోని చెరువుల నింపాలన్నారు. అంతకుముందు రాజాపేట గోపాల్ చెరువు సందర్శించారు. కార్యక్రమంలో బీజేపీ, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు నట్టు తిరుపతేష్, నాయకులు కాయితి బాల్‌రెడ్డి, లక్ష్మణ్, మధుసూదన్‌రెడ్డి, జశ్వంత్, సిద్దులు, వెంకటేశం, వీరేశం పాల్గొన్నారు.

కొంపల్లి వెంకటయ్య ఆశయసాధనకు కృషి చేయాలి



వెంకటయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మోత్కూరు: సీపీఐ నాయకుడు కొంపల్లి వెంకటయ్య ఆశయసాధనకు కృషి చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ కేంద్రంలోని కేఆర్ భవన్‌లో కొంపెల్లి వెంకటయ్య వర్థంతిని శుక్రవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చేడే చంద్రయ్య, ఉప్పల ముత్యాలు, దేశేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పోతుకంటి లక్ష్మినర్సయ్య, సీపీఐ మండల కార్యదర్శి అన్నెపు వెంకట్, పట్టణ కార్యదర్శి పులకరం మల్లేష్, గీత పనివారల సంఘం జిల్లా అధ్యక్షుడు చావల అంజయ్య, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షుడు బుషిపాక నర్సింహ, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పల మహేష్, నాయకులు కొంపెల్లి తేజ, తాడూరి లక్ష్మినర్సయ్య, పోచం కన్నయ్య, అశోక్, పెండెం వెంకటేశ్వర్లు, వీరస్వామి, ఎండీ.పాషా, అంజయ్య పాల్గొన్నారు.

సన్నాహక ప్రదర్శనకు తరలిరావాలి



మాట్లాడుతున్న దరువు అంజన్న

భువనగిరిటౌన్ : భువనగిరి పట్టణంలో ఈ నెల 27న నిర్వహించనున్న వెయ్యి గొంతులు లక్ష డప్పుల సన్నాహక ప్రదర్శనకు తరలిరావాలని బీసీ కవుల వేదిక చైర్మన్ దరువు అంజన్న పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో బాబు జగ్జీవన్ రామ్ భవన్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ అనుబంధ విభాగాల కార్యవర్గ సమావేశాన్ని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు దుబ్బ రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 27న పట్టణంలో నిర్వహించే కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ రానున్నట్లు తెలిపారు. జిల్లాలోని ప్రతి గ్రామం నుంచి పెద్ద ఎత్తున ప్రజలు డప్పులు పట్టుకుని తరలి వచ్చి విజయం చూడాలన్నారు. ఈ సమావేశంలో బైరగి మోహన్, వెంకటాచారి, స్వామి మాదిగ, భూదిడ జాని మాదిగ, దుబ్బ వెంకన్న మాదిగ, జెరిపోతుల కరుణాకర్ మాదిగ, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు



జివర్షిణి



నిఖిత

మోత్కూరు: ఖేల్ ఇండియా అండర్ 17 బాలికల రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు మోత్కూరు సేక్రెడ్‌హార్ట్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు జి.వర్షిణి, జి.నిఖిత ఎంపికైనట్లు ఆ పాఠశాల పీఈటీ ఎం.యాదయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19 నుంచి 23 వరకు గద్వాల్‌లో జరిగినున్న ఖేల్ ఇండియా అండర్ 17రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పలువురు అభినందించారు.

రోడ్లపై తోపుడు బండ్లు పెడితే చర్యలు తప్పవు

ఆలేరురూరల్ : రోడ్లపై తోపుడు బండ్లు పెడితే చర్యలు తప్పవని ఎస్ఐ రజినీకర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని రోడ్లపై తోపుడు బండ్లు పెట్టడం వల్ల కలిగే ఇబ్బందులపై పలువురు తోపుడు బండ్ల వ్యాపారులకు అవగాహన కల్పించారు. ఆయన వెంట ఏఎస్ఐ ఆంజనేయులు, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

రైళ్లు ఆపాలని వినతి



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

రామన్నపేట: రామన్నపేట రైల్వేస్టేషన్‌లో నారాయణాద్రి, ఫలక్‌నామా ఎక్స్‌ప్రెస్ రైళ్లతోపాటు, రేపల్లె, మిర్యాలగూడ డెమో రైళ్లను ఆపాలని కోరుతూ స్థానిక బీజేపీ నాయకులు శుక్రవారం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా సమయంలో రద్దుచేసిన రైళ్లు తిరిగి పునరుద్ధరించకపోవడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురి అవుతున్నారన్నారు. రైల్వే అధికారులతో మాట్లాడతానని కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు. మంత్రిని కలిసినవారిలో జిల్లా మాజీ అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావు, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి నకిరేకంటి మొగులయ్య, తాటిపాముల శివకృష్ణ, మండల అధ్యక్షుడు బంద మకరంరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మండల వెంకన్న, శంకర్, వెంకటేశం పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా

వలిగొండ : శ్రీ అభయాంజనేయ దేవాలయం అభివృద్ధికి కృషిచేస్తానని ఆలయ నూతన చైర్మన్ ముద్దసాని లక్ష్మా రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని మొగిలిపాకలోని శ్రీ అభయాంజనేయ దేవాలయం నూతన ధర్మకర్తలుగా ముద్దసాని జయసింహారెడ్డి, ముద్దసాని మంజుల, జడిగా వెంకన్న మాదిగ ప్రమాణస్వీకారం చేశారు. ప్రమాణ స్వీకారోత్సవంలో కొమ్మారెడ్డి నరేష్ రెడ్డి, మామిడి నర్సిరెడ్డి, పబ్బు ఎల్లయ్య, యుగేందర్ రెడ్డి, వెంకట పాపి రెడ్డి, వంగాల అశోకు గౌడ్, రామచంద్రా రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, సుధీర్, ముద్దసాని మహేందర్ రెడ్డి, సిద్దయ్య, విశాఖ రెడ్డి, అంజిరెడ్డి పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

యాదగిరిగుట్ట రూరల్: ఆత్మకూరు మండల కేంద్రంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన రాగిరు అంజయ్య కుటుంబాన్ని శుక్రవారం ఆత్మకూరు మండల వాట్సాప్ గ్రూప్ సభ్యులు పరామర్శించారు. వాట్సాప్ గ్రూప్ ద్వారా సేకరించిన రూ.30వేలను బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జన్నాయికోడ నగేష్, మాజీ ఎంపీటీసీ యాస కవిత, మల్లేషం, వెంకన్న, మల్లేష్, బుచ్చిరెడ్డి, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

డబుల్ ఇళ్లు పంపిణీ చేయాలి

భూదాన్‌పోచంపల్లి : నిర్మాణాలు పూర్తయి నివాసయోగ్యంగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అర్హులైన నిరుపేద కుటుంబాలకు పంపిణీ చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ అన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలో జరిగిన పట్టణ కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి దుబ్బాక జగన్, వడ్డెపల్లి యాదగిరి, గూడురు దాసు, బుగ్గ లక్ష్మయ్య, పాపని కృష్ణ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

- ఆర్డీఓ కృష్ణారెడ్డి



మోటకొండూర్: తహసీల్దార్ కార్యాలయంలో సర్వే వివరాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ కృష్ణారెడ్డి



యాదగిరిగుట్ట : గౌరాయపల్లిలో సర్వే నిర్వహిస్తున్న అధికారులు



వలిగొండ : మొగిలిపాకలో సర్వే చేస్తున్న అధికారులు

మోటకొండూర్: రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు సంబంధించిన సర్వేను క్షేత్రస్థాయిలో అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని ఆర్డీఓ కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో పథకాలకు సంబంధించిన సర్వేపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆ సందర్భంగా సర్వేకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. రైతు భరోసా సర్వే పూర్తి అయిన చామాపూర్ గ్రామంలో క్షేత్రస్థాయిలో క్రాస్ చెక్ చేశారు. రైతు భరోసాలో నూతనంగా పర్యవేక్షణ లేకుండా వెలసిన వేపెట్టిన ఇళ్లు, ప్లాట్లు, గుట్టలు, రాళ్లు వంటి వాటిని తప్పనిసరి గుర్తించాలని సాగులో ఉన్న వాటికి మాత్రమే అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఓ శ్రీధర్, తహసీల్దార్ శాంతిలాల్, ఎంపీడీఓ ఇందిర, మండల వ్యవసాయ అధికారి రమాదేవి, సీనియర్ అసిస్టెంట్, ప్రదీప్, ఏఈఓలు దేవరకొండ శివాణి, సంధ్య పలువురు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సాగుకు యోగ్యం కాని భూములపై సర్వే

మోటకొండూర్ మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో సాగుకు యోగ్యం కాని భూములపై అధికారులు సర్వే నిర్వహించారు. అధికారులు వ్యవసాయ భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సాగు యోగ్యం కాని భూములను గుర్తించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శాంతిలాల్, వ్యవసాయ అధికారి రమాదేవి, ప్ర దీప్, రామారావు, శ్రీవాణి, సంధ్య, శివ పాల్గొన్నారు.

వలిగొండ : సాగుకు యోగ్యం కాని భూముల వివరాలు గుర్తించడంతో పాటు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం లబ్ధిదారుల ఎంపిక చేసేందుకు చేపట్టిన సర్వే శుక్రవారం ఎం. తుర్కపల్లి, మొగిలిపాక, వేముల కొండ, పహిల్వాన్‌పురం, గోకారం గ్రామాల్లో నిర్వహించారు. సర్వేలో మండల ప్రత్యేకాధికారి జగన్నాథం, ఎంపీడీఓ జితేందర్ రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయ అధికారి అంజనీదేవి, డిప్యూటీ తహసీల్దార్ పుష్ప, ఆర్ఐ మనోహర్, కరుణాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట రూరల్ : మండలంలోని గౌరాయపల్లి, చిన్నకందుకూరు గ్రామాల్లో రైతు భరోసా సర్వేను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో సాగుకు యోగ్యం కాని భూములను గుర్తించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ విజయసింహారెడ్డి, ఏఈఓ ప్రణయ్, జూనియర్ అసిస్టెంట్ కర్ణాకర్, పంచాయతీ కార్యదర్శి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దగూడెం నుంచి బస్సు సర్వీసు ప్రారంభం



బస్సు సర్వీస్ ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని పెద్దగూడెం నుంచి కోఠిలోని ఉమెన్స్ కాలేజీ వరకు హయత్‌నగర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు సర్వీస్‌ను శుక్రవారం కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు పక్కీరు నర్సిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్సు జగత్‌పల్లి, పిలాయిపల్లి, కనాదిపల్లి మీదుగా దిల్‌సుఖ్‌నగర్, ఉమెన్స్ కాలేజీ వరకు రోజుకు నాలుగు ట్రిప్పులు నడుస్తుందని తెలిపారు. బస్సు సర్వీస్ ప్రారంభించడానికి సహకరించిన ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మన్నె పద్మారెడ్డి, నాయకులు కందాడి యాదిరెడ్డి, మన్నె ప్రభాకర్, కొంగరి రాంరెడ్డి, సరసం శ్రీధర్‌రెడ్డి, కన్నెమోని యాదయ్య, దొంతిరెడ్డి అంజిరెడ్డి, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోస్టాఫీస్‌లో ఆధార్ కేంద్రం ప్రారంభం

మోత్కూరు : మున్సిపల్ కేంద్రంలోని సబ్ పోస్టాఫీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని శుక్రవారం సబ్ పోస్టు మాస్టర్ దర్శ రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్టాఫీస్‌లో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రం సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఆసరా లబ్ధిదారులు తమ వేలి ముద్రలు రాకుంటే పంచాయతీ కార్యదర్శి, మున్సిపల్ సిబ్బంది ద్వారా చేసుకుని వారిని ఇకనుంచి ఆధార్ తిరిగి సమోదు చేయించుకుని తమ వేలి ముద్రలతో తీసుకోవచ్చన్నారు. మోత్కూరు పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ అసిస్టెంట్ అరుణకుమారి, మహేశ్వరి, పలువురు పోస్టల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెద్దిరెడ్డి మహేశ్‌కు సన్మానం

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని ఇంద్రియాల గ్రామానికి చెందిన పెద్దిరెడ్డి మహేశ్ ఇటీవల జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాన్ని సాధించారు. మాజీ సర్పంచ్ బండి కృష్ణాగౌడ్ శుక్రవారం మహేశ్‌ను శాలువా కప్పి సన్మానించారు. గ్రామ యువత మహేశ్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ఎర్ర వెంకటేశ్‌గౌడ్, చింతల రామకృష్ణ, శెట్టి మల్లేశ్, రెడ్డెల్లి అశోక్, పెద్దిరెడ్డి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లలో రూ. 150కోట్ల అభివృద్ధి పనులు చేశాం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు

చౌటుప్పల్: మున్సిపాలిటీ పరిధిలో గత ఐదేళ్లలో రూ.150కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేశామని మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ నిధుల నుంచి రూ. 55కోట్లు, టీయూఎఫ్ఐడీసీ నుంచి రూ. 45కోట్లు, ఇతర నిధుల నుంచి రూ. 50కోట్లతో మున్సిపాలిటీలో మంచినీటి సరఫరా, సీసీరోడ్లు, లింక్‌రోడ్ల అభివృద్ధి అధికంగా ప్రాధాన్యం ఇచ్చామన్నారు. తంగడపల్లిరోడ్డు విస్తరణ పూర్తవ్వగా చిన్నకొండూర్‌రోడ్డు, వలిగొండరోడ్డు విస్తరణ జరగాల్సి ఉందన్నారు. యాదాద్రి పవర్ ప్లాంటు మల్కాపూర్ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి పనులు చేపట్టామని తెలిపారు. ప్రభుత్వ తోడ్పాటు, రాజకీయాలకు అతీతంగా ప్రజలకు సేవలందించామన్నారు.

గ్రామాల్లో కోతుల బీభత్సం

- వీధుల్లో గుంపులుగా తిరుగుతూ జనాలపై దాడి
- ఇళ్లు, దుకాణాల్లోకి చొరబడి వస్తువుల అపహరణ
- నియంత్రణ చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్న ప్రజలు

వామ్మో.. వానరాలు



వీధుల్లో గుంపులుగా సంచరిస్తున్న కోతులు



కోతుల నుంచి రక్షణ కోసం ఓ దుకాణానికి ఏర్పాటు చేసిన ఇనుప జాలి

రామన్నపేట : మండలవ్యాప్తంగా కోతుల బెడద రోజురోజుకు పెరిగిపోతోంది. ఏ గ్రామంలో చూసినా కోతులు గుంపే కనిపిస్తోంది. వీధుల్లో గుంపులు, గుంపులుగా సంచరిస్తూ వచ్చిపోయే వారిపై పైకి వచ్చి భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఇళ్లు, దుకాణాల్లో తలుపులు తీసి ఉంటే చాలు లోపలికి ప్రవేశించి వస్తువులను, తినుబండారాలు ఎత్తుకెళ్తున్నాయి. కూరగాయలు, పండ్ల చెట్లను ధ్వంసం చేస్తున్నాయి. కోతుల బెడదతో పెంకుటిళ్లు, రేకుల ఇళ్లు ధ్వంసమవుతున్నాయి. కోతుల నుంచి రక్షణ పొందడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. అధికారంగా వెనుకబాటు ఉన్నవారు ఖర్చుకు వెనుకాడకుండా తమ ఇళ్ల చుట్టూ ఇనుప జాలీలను, సోలార్ ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేసుకుంటున్నారు. కోతుల బెడద తీవ్రం కావడంతో కొంతమంది టపాసులు, పెద్ద శబ్దాలు చేసే వాటిని తరిమి వేస్తున్నారు. ఇళ్లలో దొంగలకు బదులుగా కోతులు తిరిమే ప్రయత్నంలో కోతులు తిరిగి దాడి చేసి గాయపరుస్తున్నాయి. చాలా మంది కోతుల దాడిలో గాయపడి ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. కోతుల నియంత్రణకు అధికారులు తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. కోతులను బంధించి అటవీ ప్రాంతాలకు తరలించాలని డిమాండ్ చేస్తున్నారు. తాము చాలా ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుంది. వాటి నియంత్రణ కోసం ప్రత్యేక నిధులు కేటాయించి కోతుల బారి నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఇనుప జాలి ఏర్పాటు చేయించా



కోతులు షాపులోకి ప్రవేశించి వస్తువులను పాడు చేస్తున్నాయి. ప్యాకింగ్ కవర్లను చించివేస్తున్నాయి. కోతుల నుంచి రక్షణకు ఇనుపజాలి ఏర్పాటు చేయించా. కోతులు షాప్ ఓపెన్ చేసి ఉంటే చాలు లోపలికి వచ్చి వస్తువులను పాడు చేస్తున్నాయి. కోతుల బారి నుంచి రక్షణ కల్పించాలని కోరుతున్నా.

– బిట్రెడి సంపత్‌కుమార్, ఆటో మొబైల్‌షాప్ నిర్వాహకుడు, రామన్నపేట

శాశ్వత పరిష్కారం చూపాలి



కోతుల బెడద రోజురోజుకు పెరిగిపోతోంది. ఇళ్లలో చొరబడి వీరంగం సృష్టిస్తున్న కోతులను తరిమే ప్రయత్నంలో ఎదురు తిరిగి దాడి చేసి గాయపరుస్తున్నాయి. కోతుల సమస్య పరిష్కారానికి ప్రభుత్వం శాశ్వత పరిష్కారం ఆలోచించాలి. ఇళ్లకు, పంట పొలాలకు సోలార్ ఫెన్సింగ్ వేయించుకునేందుకు ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వాలని కోరుతున్నాం.

– కందుల హన్మంత్, రామన్నపేట